కొత్త పింఛన్లు లేనట్లేనా?



- అక్టోబర్ 1 నుంచి కొత్త ఫించన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని పింఛన్ల వెబ్‌సైట్
- అధికారులు, నాయకుల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- మరో వైపు పింఛన్లు తొలగించేందుకు నోటీసులు

ధర్మవరం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించ లేదు. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు అర్భాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధాలు లేకుండా సచివాలయాలలో దరఖాస్తు చేసుకుంటే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛను ఇవ్వలేదు కానీ ఇది మంచి ప్రభుత్వం అంటు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తుండడంతో ఇదెక్కడి విడ్డూరం అటు ప్రజలు పెదవివిరుస్తున్నారు.

అర్హత ఉన్నా ఎదురు చూపులే



గ్రామ సచివాలయం

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, కొత్త పింఛన్ల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ధర్మవరం నియోజకవర్గంలోని అన్ని సచివాలయాలకు రోజు పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళుతున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుతిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్లు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే వాలంటీర్ల సహాయంతో లబ్ధిదారులకు అందజేసే వారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛను, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని బావించిన వారు సచివాలయాల చుట్టు తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు.


నోటీసు

ఏలుకుంట్లలో పింఛన్లను తొలగిస్తున్నట్లు లబ్ధిదారుడికి నోటీసు పంపిన ఎంపీడీఓ

పింఛన్లు తొలగింపునకు కుట్రలు

పింఛన్లు తొలగించాలంటూ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ఉత్తర్వులు రానప్పటికీ ధర్మవరం మండలంలోని ఎంపీడీఓ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి ఆయన పింఛన్‌దారులకు మీరు అనర్హులు మీకు వచ్చే నెల నుంచి పింఛన్లు నిలిపివేస్తామంటు నోటీసులను ఇస్తున్నాడు. గ్రామ స్థాయి నాయకులు చెప్పిందే వేదంగా బావిస్తూ ఆయన అత్యుత్సాహంతో నోటీసులను పంపుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. నోటీసులు అందుకున్న వారు ఎంపీడీఓ దగ్గరకు వచ్చి వివరణ ఇచ్చినప్పటికీ మీ గ్రామాల్లోని నాయకులతో ఫోన్లు చేయించాలని చెబుతున్నాడని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. ఎలాగైనా పింఛన్లను నిలుపుకునేందుకు నాయకులు చెప్పినట్లు లబ్ధిదారులు వినాల్సి వస్తోంది. దీనిని ఆసరాగా తీసుకొని కొంత మంది నాయకులు పింఛన్లు మీకు రావాలంటే కొంత మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని పలువురు పింఛన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ఏపీయూడబ్ల్యూజే శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు సి.పుల్లయ్య పేర్కొన్నారు. పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్‌లో సాక్షి ఆర్సీ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన యూనియన్ డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా మొదటి ప్రాధానత్య ఇస్తామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందేలా చూస్తామన్నారు. ఈసందర్భంగా కదిరి డివిజన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జనరల్ సెక్రటరీగా సాధిక్‌వలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేంద్రరెడ్డి, కోశాధికారిగా జిలాన్, ఉపాధ్యక్షులుగా శివశంకర్, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా రామమోహన్, ప్రభాకర్, అల్లా బకాష్‌తోపాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోండి

తాడిమర్రి: గ్రీన్ ఎనర్జీ కంపెనీ పనులతో పంట పొలాలపై మట్టి చేరి పంటలు పండకుండా పోతున్నాయని, నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఆదివారం ధర్మవరం నుంచి ఆయన ప్రొద్దుటూరుకు వెళుతున్నట్లు తెలుసుకున్న దాడితోటగ గ్రామానికి చెందిన రైతులు వైఎం శ్రీనివాసరెడ్డి, సీ.రమణారెడ్డి, రంగనాయుడు, వైఎస్ హరి, వై నారాయణస్వామి, నాగభూషణం గ్రామ సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దాడితోట, పెద్దకోట్ల గ్రామాల మధ్యన ఉన్న కొండపై చదును చేస్తున్న మట్టిని టిప్పర్ల ద్వారా కొండ దగ్గర పెద్దరాశిగా పోస్తున్నారన్నారు. దీంతో దుమ్మలేసి అరటి, దానిమ్మ, టమాట, చీనీ తదితర పంటలను కప్పేస్తుండటంతో పంటలు సరిగా పండటం లేదన్నారు. స్పందించిన మంత్రి కంపెనీ వారితో మాట్లాడి వచ్చే బుధవారంలోగా న్యాయం చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

బత్తలపల్లి: రోడ్డు భద్రత అందరి బాధ్యతని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు అన్నారు. అనంతపురం -కదిరి జాతీయ రహదారిపై లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆదివారం వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపైన అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానాలు విధించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. తల్లిదండ్రులు సైతం మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ జన్మదినం సందర్భంగా ఆదివారం కదిరి ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బత్తల యువసేన ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బత్తల యువసేన నాయకులు కిరణ్, మహేష్,సూరి తదితరులు పాల్గొన్నారు.

వరి పొలంలోకి వర్షపు నీరు

- కాంట్రాక్టర్ నిర్వాకం

బత్తలపల్లి: జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో కాంట్రాక్టర్ అనాలోచిత చర్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై నల్లబోయనపల్లి వద్ద రోడ్డుకు ఆనుకుని ఆదినారాయణకు తనకున్న పొలంలో వరిపంటను సాగు చేశాడు. అయితే ఆదివారం కురిసిన వర్షానికి వర్షపు నీరు పొలంలోకి చేరినట్లు తెలిపారు. తద్వారా రాళ్లు, మట్టి పొలంలోకి వచ్చిందన్నారు. రోడ్డు వేస్తున్న సమయంలో కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డితో గ్రామం నుంచి వచ్చే వంకకు చిన్నగా కాలువ ఏర్పాటు చేయడం వల్ల నీరు అంతా పొలంలోకి వచ్చే ప్రమాదం ఉందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఓ మోస్తరు వర్షానికే నీరు పొలంలోకి వస్తే రాబోయే రోజుల్లో పెద్దగా వర్షం కురిస్తే తమ పొలం పరిస్థితి ఏమిటి అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రైతుతోపాటు గ్రామానికి చెందిన చింతన్న, ఓబిలేసు, నారాయణ స్వామి, ఆదినారాయణ పొలాలు ఇక్కడే ఉన్నాయి. భారీ వర్షం వస్తే తమ పొలాల్లోకి వర్షపు నీరు వచ్చే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వరి పంటలోకి చేరిన వర్షపు నీరు, రాళ్లు మట్టి

ఉపాధ్యాయ సమస్యలపై సత్యాగ్రహ దీక్ష

ధర్మవరం అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సత్యాగ్రహ దీక్షను చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి దాదాపు పదేళ్లవుతున్నా నేటికి ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ టీచర్లకు వర్తించడంలేదన్నారు. మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికి తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమ చేసేందుకు గాని, ఖాతాలలో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించుకునేందుకు గాని అవకాశం లేకుండా పోయిందన్నారు. మున్సిపల్ టీచర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న సత్యసాయి జిల్లాలో అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్ష చేపడుతామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షుడు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతామహాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతీ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్‌వలి, శివశంకర్, హరికృష్ణ, రమీజాబి, లక్ష్మీనారాయణ, నరేష్, సుబ్బారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ఆత్మీయ సమావేశం

కదిరి అర్బన్: స్థానిక దత్తా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కదిరి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సాధన ఉన్నత పాఠశాల నిర్వాహకులు గౌస్‌పీర్, సాదిక్‌బాషా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.75 వేలు, విద్యార్థిని హరి కౌస్తుబా రూ.6 వేలు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థిని సన్మానించారు. ఏపీ ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ప్రవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, కరస్పాండెంట్లు మెమిన్ సలీంబాషా పాల్గొన్నారు. అనంతరం సంఘం కదిరి డివిజన్ అధ్యక్షుడిగా సురేష్, గౌరవాధ్యక్షులుగా శివశంకర్, కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అలీంబాషా, ప్రధాన కార్యదర్శిగా అమరనాథ్, కోశాధికారిగా కుమార్‌ను ఎన్నుకున్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్ తదితరులు

ఘనంగా గంగమ్మ జాతర

పుట్టపర్తి రూరల్: పట్టణంలో ఆదివారం చిత్రావతి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. చిత్రావతి హారతీఘాట్ వద్ద రష్యాకు చెందిన భక్తుల సాయంతో గంగమ్మ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించారు. ఆలయ పునరుద్ధరణ పూర్తయి 45 రోజులు కావడంతో జాతర నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాన్ని సార్వంగసుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



పెడపల్లి జగనన్న కాలనీలో రోడ్డు కోతకు గురైన దృశ్యం



నిండుకుండలా ప్రవహిస్తున్న బత్తలపల్లి సప్లయ్ చానల్



రోడ్డు పక్కన పొలాల్లోకి చేరిన వర్షపునీరు

పుట్టపర్తిలో భారీ వర్షం

పుట్టపర్తి రూరల్: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కుండపోతగా వర్షం కురవడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రధాన రహదారులతో పాటు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు జలమయమయ్యాయి. హనుమాన్ సర్కిల్, సత్యమ్మ ఆలయం చుట్టూ వర్షపు నీరు చేరింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లపై వర్షపునీరు పారింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బాలికల వసతిగృహ ఆవరణలో చేరిన వర్షపునీరు

ప్రశాంతంగా జీవించాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలి. ప్రజలను రెచ్చగొడితే కఠినంగా శిక్షిస్తామని ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. గొడవలకు దూరంగా ఉండి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, జూదం, కర్ణాటక మద్యం విక్రయాలు చేపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశాలు ఉన్నా.. కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తనకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ గోపి మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని రౌడీ షీటర్లకు, పాత నేరస్తులకు ఆదివారం ఇన్‌చార్జ్ సీఐ శ్యామ్‌రావు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి గొడవలకు దిగినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పనులు చేసుకుంటూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

పోలీసు లాంఛనాలతో సీఐ అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్/నల్లమాడ : కడప ట్రాఫిక్ సీఐ అర్జున్‌నాయక్ అంత్యక్రియలను ఆదివారం పోలీసుల లాంఛనాలతో నిర్వహించారు. నల్లమాడ మండలం అరవవాండ్లపల్లి తండాకు చెందిన కడప ట్రాఫిక్ సీఐగా పని చేసేవాడు. అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. జిల్లా ఎస్పీ రత్న సీఐ మృతిపై ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు సీఐ అర్జున్‌నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. పోలీస్ శాఖ అండగా ఉంటుందని ధైర్యంగా చెప్పారు. అనంతరం పోలీస్ గౌరవ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నల్లమాడ సిఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూల్చేశారని ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: తాను కట్టుకున్న రేకులషెడ్డును దౌర్జన్యంగా కూల్చేశారని ఓ మహిళ టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల... గుట్టకిందపల్లికి చెందిన ఎం.అరుణకు సర్వేనంబర్ 545లోని 0.01సెంట్ల స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని కొన్నేళ్లుగా నివసిస్తోంది. ఉదయం మోపూరురాజు, కల్పన, సురేష్, కల్పన, నాగేంద్రమ్మ మరికొంత మంది వచ్చి జేసీబీతో షెడ్డు కూల్చేశారు. దీన్ని అడ్డుకున్న బాధితురాలిపై దాడి చేశారు.

గొర్రెల కాపర్లపై దాడి

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో గొర్రెల కాపరులపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గంగాధర్, చిన్న గంగన్న గ్రామ సమీపంలోని వంక వద్ద గొర్రెలు మేపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు, ప్రకాష్‌తో పాటు మరికొంత మంది దాడి చేశారు. గ్రామంలో వినాయక చవితి పండుగ రోజున చిన్నపాటి గొడవ జరిగిందని, దాన్ని మనసులో ఉంచుకుని తమపై దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కనగానపల్లి: మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు.. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో కనగానపల్లికి చెందిన సరోజమ్మ, ఆమె కుమారుడు సురేష్ అనంతపురం నుంచి మామిళ్లపల్లి వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సురేష్‌తో పాటు అతడి తల్లి సరోజమ్మ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొని దెబ్బతిన్న లారీ

బత్తలపల్లి: మండల కేంద్రంలో లారీ రోడ్డు డివైడర్‌ను ఢీ కొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. తాడిపత్రి నుంచి బెంగుళూరుకు సిమెంట్‌తో వెళ్తున్న లారీ ధర్మవరం వైపు నుంచి బత్తలపల్లికి వస్తున్న వాహనం లైటింగ్ పోకస్‌కు బైపాస్ బ్రిడ్జి వద్ద ఎదురుగా ఉన్న డివైడర్లను గుర్తించక ఢీ కొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలతో బయటపడగా లారీ బాగా దెబ్బతింది. ఈఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదని సమాచారం.